# జారిన క్షణం

ప్రక్కన ఏదో పిడుగుపడుతున్నట్లు ధనధనా చప్పుడౌతోంది. ఏవేవో సామాన్లు ఉండిఉండి దడదడా దొర్లి పడుతున్నాయి. కంఠాలన్నీ కలబోసినట్లు రకరకాల ధ్వనులు, రకరకాల మాటలు చుట్టూ వినపడుతున్నాయి. నిద్ర మత్తులో శంకరానికి అదంతా సుమారంగా ఎక్కడోలా ఉంది. నిద్ర వదలడం లేదు. చిరాకుగా ఉంది. ప్రక్కన ఉన్న టవలు తీసి ముఖానికి చుట్టుకు ముడుచుకు పడుకున్నాడు. ఇంకా ఈ ప్రపంచంలో పడాలని లేదు. ఈ కోలాహలానికి దూరంగా ఏ ఆలోచనా, వ్యథా లేని మత్తులో మునిగిపోవాలనుంది.

“నిద్ర లేవరూ? పిల్లలంతా అప్పుడే తలంటుకున్నారు. ఇవ్వాళైనా పెందరాడే లేవకూడదూ?” అని మంచం ప్రక్కన శాంతగొంతు సంతోషంగా ఉత్సాహంతో పిలుస్తోంది.

నిద్ర చెదరిపోయింది. బాహ్య ప్రపంచం పాములా ప్రాకివచ్చి మెల్ల మెల్లగా మెదడును కమ్ముకుంది. అతను

నిర్లిప్తంగా కన్ను తెరచి చూచాడు, శాంతకేసి నిదానంగా; ఆమె ఎవరో, అక్కడ ఎందుకుందో, ఏమంటోందో తనకేమీ అర్థంకానట్లు! ఆమె అతనిదగ్గరకు వచ్చింది. ఆప్యాయంగా చెయ్యి పట్టుకుంది. సంతోషంగా లాలనగా అంది "లేవండీ! ఎన్ని పనులున్నాయి! బజారుకు వెళ్లాలి. ఇవ్వాళ పండగ కాదూ?"

అతను ఇంకా ఏమీ అర్థంకానట్లు కళ్ళు పెద్దవిచేసి చూస్తూ ఊరుకున్నాడు.

పెరటివేపునుంచి పెద్దగా ఏడుపు వినిపించింది. పిల్లలు పోట్లాడుకుంటున్నారు. పెద్దపిల్ల ఏదో కోప్పడుతోంది. చిన్నపిల్ల కచ్చగా ఏడుస్తోంది. శాంత అతని చెయ్యి వదిలేసి వెళ్ళిపోయింది.

అతను మళ్లా టవలు తీసి ముఖం కప్పుకున్నాడు. నిట్టూరుస్తూ నిస్పృహగా పక్కకు వత్తిగిలి పడుకున్నాడు. అతనికి రోజు ప్రారంభమైంది. మనస్సు ఆలోచనలతో నిండిపోయింది.

★ ★ ★

ఇవ్వాళ పండుగ – తనకు సెలవు. ఇంకాస్సేపు సోమరిగా ఏ బంధాలూ లేనట్లు అలాగే మంచాన్ని కరుచుకు ఉండవచ్చు. అది ముందుగా లీలగా తోచిన ఆలోచన.

ఏం పండుగ? సంక్రాంతి. అది స్ఫురణకు రాగానే

ఏదో కొరడాతో కొట్టినట్లయింది. ఉలిక్కిపడ్డాడు. నిరుడు పండుగకు అమ్మా లలితా ఉన్నారు. అప్పుడే సంవత్సరం గడచిపోయింది.

పండుగకు పదిరోజులు ముందుగా అమ్మ వచ్చింది. పండుగవరకు ఉంటానంది. అమ్మ ఉంటే శాంతకు, పిల్లలకు కావలసినంత కాలక్షేపం. తను ఎక్కడ తిరిగినా ఫరవాలేదు; అన్నీ అమ్మ చూసుకుంటుంది.

లలిత ఇక్కడ చదువుకుంటోంది. హాస్టలులో ఉంది. ఆ స్కూలు, హాస్టలు అన్నీ ఊరికి దూరం. వెళ్ళటానికి ప్రత్యేక ప్రయాణం కావాలి. ఆ అక్కా బావా తమకు దూరమై చాలా రోజులైంది. బావగారు తగని కోపిష్టి, అత్తవారు తనకు తగినంత మర్యాదలు చెయ్యటం లేదని ఎప్పుడూ బాధపడతాడు. ఒకసారి చిరాకు తెచ్చుకున్నాడంటే కొన్నాళ్ళవరకు తిప్పుకోలేడు. అతని సాధింపులతో అక్కయ్య నలిగిపోతుంది; రాకపోకలు ఉండవు.

అందుకే తను లలితను చూడటానికి వెళ్ళలేదు. బావ తనను వెళ్ళమని రాయలేదుగదా అనుకున్నాడు. అసలు అక్కడికి వెళ్ళాలంటే పెద్ద ప్రయాణంగా వెళ్ళాలి. అందుకు ఎప్పుడూ తీరిక ఉండదు. ఎప్పుడైనా క్షణం తీరిక ఉంటే ఇల్లు కదలడానికి బద్ధకం.

అమ్మ వచ్చిన మర్నాడే అంది:

"లలిత ఈ సంవత్సరం ఇక్కడ చదువుకుంటోంది గదరా! ఒక సెలవు రోజు వెళ్ళి దాన్ని మనింటికి తీసుకురా!" అని. తనకు గుండెల్లో రాయి పడింది; ఆ స్కూల్లో పంపుతారో పంపరో — తమ ఇంటికి రావడం బావ కిష్టముంటుందో ఉండదో అని. అయినా ఇవేవీ అమ్మ వినిపించుకో లేదు.

"ఎందుకు పంపరూ! మనం పరాయివాళ్ళమా! బావ ఏమనుకుంటే మనకేం! పసిపిల్ల — దానికీ మనకూ పట్టింపులేమున్నాయి!" అంటూ అన్నీ నిర్లక్ష్యంగా తోసి పారేసింది.

ఒక ఆదివారం వెళ్ళి తీసుకువచ్చాడు. లలిత సంతోషంగా వచ్చింది. చెరలోనుండి విముక్తి పొందిన వ్యక్తిలా, ఆవేళ ఎంతో ఉత్సాహంగా ఉంది. వచ్చేటప్పుడు అమ్మకు పళ్ళు తెచ్చింది. ప్రేమతో పళ్ళు తెచ్చిన లలితను చూసి అమ్మ సంతోషించింది. ఆ రాత్రి వాళ్ళిద్దరూ ఏదో పరిపూర్ణత సిద్ధించినట్లు సంతృప్తితో ఉన్నారు.

ఆ రాత్రి వెన్నెట్లో అమ్మ కాళ్ళు చాపుకు కూర్చుంది. లలిత అమ్మ ఒళ్ళో తల పెట్టుకు పడుకుంది, పైన చంద్రుని కేసి చూస్తో. అమ్మ లలితను ఇంటి ముచ్చట్లన్నీ అడిగింది. లలిత తన గొడవ చెప్పుకుంది. "ఎంత మంది ఉన్నా, హాస్టల్లో ఏదో బెంగగా ఉంటుంది. ఎప్పుడూ ఎక్కడికి పారిపోదామా అనిపిస్తుంటుంది. మావయ్య

ఎప్పుడూ రమ్మనలేదు. ఇవ్వాళ ఎంత బావుంది! ఏ దిగులూ లేదు."

ఆ మాటలు విని అమ్మ జాలిపడింది. ఆప్యాయంగా దాని తల నిమురుతూ అంది: "ప్రతి ఆదివారం రావే, పిచ్చి తల్లీ! మావయ్య వచ్చి తీసుకువస్తాళ్ళే," అని. లలిత ఉత్సా హంగా చెప్పింది: "మళ్ళా పండక్కి వస్తాను అమ్మమ్మా! ముందురోజే మావయ్యను పంపించు." అన్నది. ఆ మాటలు వినగానే తనకు గుండెల్లో రాయిపడ్డది. ఇదేదో కొత్త బాధ్య తలా తోచింది. అయినా తను ఏమీ అనలేదు.

మర్నాడు లలిత వెళ్ళిపోయింది. పండుగ రెండురోజు లుందనగానే అమ్మ చెపుతూ వచ్చింది; "లలితను తీసుకు రారా! వస్తానన్నది." అని. తన కెందుకో తీసుకురావా లనిపించలేదు. అది వస్తే ఇంక తనకు బహుశా ఒక్కక్షణం తీరిక ఉండదు. అది ఒక నిమిషం కుదురుగా ఉండలేదు. ఇంటికి రాగానే దానిలో దాగిన చైతన్యమంతా ఒక్కసారి విజృంభిస్తుంది. మొన్న చూశాడుగదా! ప్రొద్దున వెళ్ళి సాయంత్రం వచ్చే తనప్రాణం, ఒక్కరోజు సెలవుకోసం ఎదురు చూస్తుంది. ఆ ఒక్కరోజు హైరానపడటం ఇష్టం ఉండదు. అయినా అమ్మకోసం తీసుకువద్దామనే అను కున్నాడు. కాని, వెళ్ళలేదు. పండుగ ముందురోజు ఆఫీసు నుంచి వచ్చేటప్పటికే పొద్దుపోయింది. మర్నాడు వెళ్ళుదా మనుకున్నాడు. కాని, నిద్ర మెలకువరాలేదు. అసలు కారణం

వెళ్ళాలన్న ఉత్సాహం లేదు. ఏదో నిర్లిప్తత—అమ్మ రెండు మూడుసార్లు పిలిచింది:

“లేవరా! హాస్టలుకు వెళ్ళాలిగా!” అని. తనకు నిద్రమత్తు వదల్లేదు. లేవడానికి బుద్ధి పుట్టలేదు. ఏదో తప్పించుకోడానికి అన్నాడు: “కబురుచేశాను లేవే! అదే వస్తుంది,” అని.

శాంత ఇల్లంతా ముగ్గులుపెట్టి తోరణాలుకట్టి, రకరకాల పిండివంటలతో పండుగచేసింది. పన్నెండుదాటినా అమ్మ భోజనం చేయకుండా లలితకోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అది చూసి తను భరించలేక, “నువ్వెళ్ళి భోం చెయ్యమ్మా! అది ఇంక రాదేమోలే” అన్నాడు. అమ్మ మాట్లాడలేదు; ఉపవాసం కాకుండా ఎంగిలిపడి మూల పడుకుంది, దిగులుగా.

మళ్ళా రెండు రోజులకి వెళ్ళిపోయింది తరువాత ఒక రోజు కనిపించింది బజార్లో. తన గుండె గతుక్కుమంది. అయినా ధైర్యంగా దగ్గరకు వెళ్ళి అన్నాడు: “ఏమే, పండుగరోజు రానేలేదూ?” అని, అది తెల్లబోయింది. అయినా తొణకలేదు. అప్పటికి దానికి పెద్దరికం వచ్చింది. తొందరపడి “నువ్వు రాలేదుకదా! మావయ్యా!” అనలేదు. “క్లాసు ఉంది మావయ్యా! రావటానికి వీలుపడలే,” దంది. కాని దాని ముఖంలో బాధ కనపడుతోంది. ఏదో తప్పు చేసినవాడిలా తను వెళ్ళిపోయాడు.

ఏడాదయింది. మళ్లా యింకో పండుగ వచ్చింది. ఇప్పుడు అమ్మా, లలితా ఇద్దరూ లేరు. ఈ ప్రపంచంతో విరక్తి చెందినట్లు, ఇద్దరూ ఒక్కసారే నిష్క్రమించారు. అమ్మ హటాత్తుగ గుండె జబ్బుతో పోయింది. లలిత ఒక్క రోజు జ్వరంతో నశించిపోయింది. వాళ్లకోసం తానిప్పుడు చేయగలిగిందేమీ లేదు. కాస్త జడత్వం, నిర్లిప్తతా వదుల్చుకొని ఉంటే ఆ సంక్రాంతికి అల్పమైన సంతోషాన్ని వారికి తాను కలిగించి ఉండవచ్చు. ఇద్దరూ ఒక్కరోజు సంతోషంగా ఉండేవాళ్లు. ఇప్పుడు మనస్సులో బాధ మాత్రమే మిగిలింది.

తనలో ఏదో జడత్వం ఉంది. కపటంలేదు. ఒకరి మనస్సు నొప్పించాలన్న కోరికలేదు. అయినా, ఒకరికి సంతోషాన్ని కలిగింపగలిగిన శక్తీ, ఉత్సాహమూ లేవు. అన్నింటికీ ఏదో జడత్వం, నిరుత్సాహం, నిస్పృహ! ఎప్పుడో చిన్నతనంలోనే ఈ జబ్బు పట్టుకుంది. ఈ జీవితంలో తాను చెయ్యగలది ఏమీ లేదు. మనస్సులోని భావాలకూ, మనుగడకూ సంబంధము లేదు. మధురమైన ఊహాలు మనస్సులోనే దాచుకొని నిర్లిప్తంగా లేని ఉత్సాహాన్ని నటిస్తూ బతకడంకన్నా చెయ్యగల దేమీ లేదు! ఎప్పుడో ఒకసారి తీవ్రమైన విరక్తి కలుగుతుంది. ఈ జడజీవనంమీద తిరుగుబాటు చేసి, తను అన్నివిధాలా నశించిపోయినాసరే, ఏ ముసుగూ లేకుండా ప్రపంచం ఎదుట నిర్భయంగా నిల

బడాలని ఉంటుంది? కాని అది క్షణకాలం మాత్రమే! అలా
చేస్తే వెంటనే ప్రపంచం తనను పిచ్చివా డంటుంది. అంతే
ప్రయోజనం! ఆ విరక్తి అంకురించిన క్షణమే అణగారి
పోతుంది? ఇక నిర్లిప్తతా, నిస్పృహా మాత్రమే మిగులు
తాయి! బతుకును అన్నివిధాలా భయం కప్పుతుంది.

గుమ్మంముందు కుష్ఠురోగి హృదయ విదారకంగా
అరుస్తాడు. ఆ అరుపుకు గుండె చీల్చినట్లవుతుంది. చేయి
ఆలోచన లేకుండా జేబులోకి వెళుతుంది. మరుక్షణం
అక్కడే ఆగిపోతుంది. ప్రపంచంలో ఉన్న కుష్ఠురోగు లంద
రినీ నీవు ఉద్ధరించగలవా అంటుంది నిస్పృహ! వీడికి నీవు
డబ్బులిచ్చి పంపుతే ఇంకా పదిమంది వచ్చి చుట్టుకుంటే
ఏం చేస్తావు అంటుంది భయం! వెంటనే చేయి, శరీరము,
మనస్సు అన్నీ ఒక్కసారి జడమై ఊరుకుంటాయి. ఆ
దౌర్భాగ్యుని అరుపు వినపడకుండా దూరంగా పారిపోవ
టానికి మాత్రమే తనలో శక్తి మిగులుతుంది.

ఒకసారి తాను ఒంటరిగా ఉన్నప్పుడు ఒక నల్లని
కుక్కపిల్ల తనను చుట్టుకుంది. తనను దాని యజమానిగా
ఎన్నుకున్నది. రాత్రింబవళ్ళు తనను వెతుక్కోవడమూ,
తనకు సన్నిహితంగా ఏదో సంతృప్తి పొందడమూ దానికి
సహజమైనాయి. దానికి ఒంటినిండా ఏదో గజ్జీ, ఒంటరి
తనమూ! ఆ బాధ అంతా దాని కళ్ళల్లో కనిపించేది. ప్రపం
చంలో వున్న ఒంటరితనమూ, నిరాశా, వేదన అంతా దాని

కళ్ళల్లోనే నిండినట్లు తోచేది. ఆ కళ్లతో అది తనను అమాయకంగా చూచేది. తన కాళ్లకు దగ్గరగా, తనకు సన్నిహితంగా, నిశ్శబ్దంగా కూర్చోటం కంటె అది తననుంచి ఏమీ కోరలేదు.

అయినా అది తన జీవితంలోకి వచ్చినప్పటినుంచీ తనకు విపరీతమైన భయం పట్టుకుంది. అప్పుడు శాంత ఊళ్ళో లేదు. ఆ గజ్జికుక్కను చూసినప్పుడల్లా తనకు విపరీతమైన జాలి పుట్టుకొచ్చేది. దానికి అన్నం పెడదామా, బిస్కట్లు ఇద్దామా అని ఇట్లాంటి పిచ్చి ఆలోచనలు వచ్చేవి. అయినా తెలివిగా జాగ్రత్తగా వాటి నన్నింటినీ చంపుకున్నాడు. ఈ గజ్జి కుక్కకు కాస్త చనువు ఇస్తే, ఇక ఇది ఇల్లంతా తిరుగుతుందేమో! ఎక్కడికి వెళ్ళినా తననే వెన్నాడుతుందేమో! ఇక ఎప్పటికీ తనను వదలదేమో! ఈ భయాలు బరువుగా పట్టుకున్నాయి.

అంకుచేత పనికట్టుకుని అది తన దగ్గరికి వచ్చినప్పుడల్లా కసురుకుని తరిమికొట్టాడు. అయినా అది సులభంగా పోలేదు. ఎంత కసిరినా అక్కడే నిలబడి దీనంగా బెదరి బెదరి చూచేది. వెళ్ళిపోయినా ఆశతో నిలువలేక మళ్లా మళ్లా వెనక్కు తిరిగి వచ్చేది, అమాయకంగా జాలిగా చూచేది. తనకు ఏం చెయ్యాలో తోచేది కాదు. దానిమీద జాలి కలిగినా, జాగ్రత్తగా ఆ భావం దాచుకోవలసివచ్చేది. ఈ అనుబంధం విడరాని బంధమౌతుందేమో - దానివల్ల ఏమి చిక్కులు వస్తాయో అన్న భయంతో!

ఒకరోజు అది రాలేదు. రెండోరోజు రాలేదు. మూడోరోజు రాలేదు. తనకు ఏమీ తోచలేదు. అది రావడం, తాను తరమడం అలవాటైపోయింది. ఉండబట్టలేక తోటవాడిని పిలిచి అడిగాడు: "ఈ తోటలో ఒక నల్లకుక్క-పిల్ల తిరుగుతూ ఉండేది కదరా ? ఏదీ అది?" అని.

తోటవాడు నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు:

"ఆఁ. అది మొన్ననే చచ్చిపోయింది కదండీ! ఆ వీధి పిల్లలంతా దాన్ని రాళ్ళతో కొట్టి చంపారు"అన్నాడు.

తనకు తల తిరిగింది! ఏదో చెప్పలేని బాధా, భయమూ కలిగాయి.

"ఎందుకురా?" అన్నాడు కంగారుగా.

"ఎందు కేవిటండీ? ఉత్తినే, సరదాకి!"వాడు తాపీగా సమాధానం చెప్పాడు.

తనకి నోటమాట రాలేదు. సరదాకి పసిప్రాణాన్ని హింసించి చంపడం అనేది తన ఊహ కందలేదు. దాని అమాయకమైన కళ్ళూ, ఆ వేదనా తన హృదయంలో శాశ్వతంగా నిలచిపోయాయి. ఆ కళ్ళు రెండూ తన గుండెల్లో దాచి, అది శిథిలమైంది. దానిమీద అణుమాత్రమైనా ఆప్యాయత చూపనందుకు గుండె ఈ నాటికీ కుమిలిపోతోంది. ఇవ్వాళ అది కనిపిస్తే, దాన్ని ఆప్యాయంగా గుండెలకు హత్తుకుంటాడు. ఆప్యాయంగా దాని తల నిమురుతాడు.

"నీకేం భయంలేదు. ఈ ప్రపంచంలో నేను నీకు తోడుగా ఉంటాను," అని చెబుతాడు కాని అది రాదు. ఈ జన్మలో మళ్లా కనిపించదు. ఆ క్షణం జారిపోయింది. దాని బెదరిన చూపులుమాత్రం మనస్సులో మెదులుతూ ఉంటాయి.

అంతే! అమ్మా లలితాకూడా ఈ జన్మలో మళ్లా కనిపించదు. వాళ్ళిద్దరూసంతోషంగా కలసిఉండే ఒక మధురక్షణం తన జడత్వంవలన శాశ్వతంగా జారిపోయింది. ఇప్పుడు చేయ గలిగిందేమీ లేదు - బాధపడకుండా మనస్సు మరింత జడం చేసుకోటం తప్ప.

★ ★ ★

"ఎండ నెత్తిమీద కొస్తోంది. మీరు లేవరూ? పండుగపూటైనా పిల్లలతో, నాతో కలిసి సంతోషంగా ఉండరూ!" అప్పటికి పదోసారో ఏడోసారో శాంత పిలుస్తోంది. ఆ గొంతులో నిరాశా, దుఃఖమూ ధ్వనిస్తున్నాయి. ఈసారి అతనికి జడత్వం వదలింది: నిదమత్తు వదలింది. ఈక్షణం శాంతనూ పిల్లలనూ సంతోషపెట్టవచ్చు. నిర్లిప్తంగా ఊరుకుంటే ఈ క్షణమూ జారిపోతుంది. శాశ్వతంగా కాలగర్భంలో కలసిపోతుంది. ఎంత పరితపించినా అది మళ్లా వెనక్కు తిరిగిరాదు.

అతను ఆమెను ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. ఆ క్షణం మెరపులా మెరసి ఇల్లంతా కాంతితో నింపింది.